ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 10 ఫిబ్రవరి 2024





నులిపురుగుల నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులదే

» జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్డీఓ, మండల కార్యాలయాల్లో ప్రభుత్వ భూములను రికార్డులను పరిశీలించి భూకబ్జాలకు గురికాకుండా చూడాలన్నారు. విద్యా సంస్థలకు, పరిశ్రమలకు, హెచ్‌ఎండీఏకు, ఇతర అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ భూముల రికార్డులను సమర్పించాలని సూచించారు. జిల్లాలోని చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఎలను గుర్తించాలని తెలిపారు. అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

20న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి

ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఈ నెల 20న తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెన్‌డజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కరపత్రాలు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి ఫిబ్రవరి 27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంవిజయవంతమయ్యేలా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని ఆయన సూచించారు.

విటమిన్-ఏ పై 13నుంచి క్యాంపెయిన్

విటమిన్-ఏపై ఈ నెల 13 నుండి 18 వరకు ఆరు రోజుల క్యాంపెయిన్ ఉంటుందని 9 నెలల వయస్సు ఉన్న పిల్లల నుంచి సంవత్సరం వయస్సు గల పిల్లలకు విటమిన్-ఏ మందు ఎంఎల్ డోస్, ఏడాది నుంచి ఐదేళ్ల పిల్లలకు 2-ఎంఎల్ డోస్ తప్పకుండా వేయించేలా అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. మండల, గ్రామ స్థాయిలో డీఈవో, మెప్మా పీడీ, డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమ అధికారి, డీపీవో, జడ్పీ సీఈవోల సమన్వయంతో సమావేశాలను నిర్వహించాలని తెలిపారు.

ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలి

మార్చి 3వ తేదీ నుంచి పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పల్స్ పోలియోపై అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 4 నుంచి 5వ తేదీ వరకు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలకు పోలియో చుక్కలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పీ సీఈవో దిలీప్ కుమార్, డీఆర్డీఏ పీడీ ప్రభాకర్, ఇంచార్జ్ డీపీవో సంధ్యారాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, డీఈవో సుశీందర్ రావు, డాక్టర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితాపై సమావేశం

తుది ఓటరు జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించామన్నారు. జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 35,91,987 మంది ఓటర్లున్నారని తెలిపారు. తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్ కార్యాలయాలలో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో అందుబాటులో ఉంచామని, జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో అప్పుడే ఉష్ణోగ్రతలు పెరిగి పోయాయి. భానుడు భగ్గుమంటున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం క్రితం చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటలు దాటితే వేడికి తట్టుకోలేకపోతున్నారు. మధ్యాహ్న వేళలో భానుడు మరింత తీవ్రంగా విజృంభిస్తున్నాడు. రాత్రివేళ ఉక్కపోత కూడా పెరిగింది. దీంతో జనం అప్పుడే కూలర్లు, ఏసీల వాడకం మొదలు పెట్టారు.

తగ్గిన చలి... పెరిగిన ఎండ!

» మధ్యాహ్నం మరింత తీవ్రం
» రాత్రివేళ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
» అప్పుడే కూలర్లు.. ఏసీల వాడకం

ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతల తాకిడి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9: చలికాలంలోనే ఎండలు చిటపట మంటున్నాయి. ఫిబ్రవరిలో మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉన్నట్టుండి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. దీంతో గతేడాది మార్చి నెల ఆరంభంలోనే ఎండలు మండి పోతేనే అబ్బో అన్న ప్రజలకు.. ఈ సారి ఫిబ్రవరిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత ఏడాది ఇదే సమయంలో పోల్చితే ఎండలు ఈసారి తీవ్ర స్థాయికి చేరిపోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. సాధరణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదువుతున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే.. మార్చి, ఏప్రిల్, మేలో ఎలా ఉంటాయోనని జనం జంకుతున్నారు.

ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగి పోయాయి. గురువారం వికారాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన 33.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది నమోదైన ఉష్ణోగ్రతను పరిశీలిస్తే ఈ సారి 5 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన 33.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది నమోదైన ఉష్ణోగ్రతను పరిశీలిస్తే.. ఈ సారి 4.6 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. మేడ్చల్ జిల్లాలో గత ఏడాది 35.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 3.3 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. రోజురోజుకూ ఉష్ణోగ్ర పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు. మధ్యాహ్నం వేడి పెరగడంతో పాటు రాత్రి ఉక్కపోత కూడా ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్పుడే కూలర్లు, ఏసీల వాడకాన్ని మొదలు పెట్టారు.

గత ఏడాది ఫిబ్రవరి, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

	మేడ్చల్ జిల్లా		రంగారెడ్డి జిల్లా		వికారాబాద్ జిల్లా	
తేది	2023	2024	2023	2024	2023	2024
01	32.6	31.9	32.5	32.5	34.3	32.9
02	32.6	34.0	31.7	32.6	33.0	32.3
03	32.7	32.5	30.4	35.6	34.5	34.2
04	31.8	32.9	32.2	33.8	30.4	33.8
05	33.5	33.7	33.4	35.7	34.9	34.3
06	32.8	35.2	32.9	33.2	34.4	35.0
07	34.6	38.3	34.3	38.4	34.4	38.2
08	35.1	38.4	33.9	38.5	33.6	38.6
09	36.4	37.3	35.1	37.4	36.9	37.1



ఎండలో తిరగలేక పోతున్నా



రోజూ ఊరూవాడ తిరిగి పాత సామాన్లు కొంటుంటాం. ఉదయం 8 దాటితే చాలు ఎండ దంచి కొడుతుంది. మధ్యాహ్నం ఎండకు వ్యాపారం చేసుకోలేక పోతున్నా. తిరిగి సాయంత్రం గ్రామాల్లో పర్యటిస్తున్నాను.

సారంగి వీరస్వామి, స్ర్కాప్ వ్యాపారి, హిమయత్‌నగర్

ఎండ తీవ్రత పెరిగింది



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకి తగ్గింది. ఎండలు ముదిరాయి. మధ్యాహ్న సమయంలో ఆటో తోలాలంటే ఎండకు ఇబ్బందిగా మారింది. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే.. మున్ముందు ఎలా ఉంటుందోనని భయమేస్తుంది.

బీసా మహేందర్, ఆటో డ్రైవర్, మొయినాబాద్

ఉక్కపోత పెరిగింది



పదేళ్లుగా కొందుర్గు మండల కేంద్రంలో లస్సీ అమ్ముతున్నా. వ్యాపారం బాగానే సాగుతుంది. కానీ.. ఈ సారి ఫిబ్రవరిలోనే ఎండ దంచి కొడుతుంది. మార్చి, ఏప్రిల్‌లో ఎండలను తలచుకుంటేనే భయమేస్తుంది. ప్రస్తుతం ఎండతో పాటు ఉక్కపోత కూడా పెరుగుతుంది.

నర్సింహులు, లస్సీ బండి వ్యాపారి, కొందుర్గు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సతీష్‌కుమార్

నూనె దినుసుల సాగుపై దృష్టి సారించాలి

» భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్

షాబాద్, ఫిబ్రవరి 9 : రైతులు నూనె దినుసుల పంటలపై దృష్టి సారించాలని భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ డాక్టర్ జీడీ సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్, హైదరాబాద్, మరియు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 180 మంది రైతులకు కుసుమ పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కుసుమ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ముఖ్యంగా తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. పంట ఎదుగుదల, దిగుబడిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డాక్టర్ మంగేష్ దుబే, డాక్టర్ ఖురేషి, డాక్టర్ సురేష్, డాక్టర్ జవహర్, సుగుణమాల ఉత్పత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు మల్లారెడ్డి, అంజయ్య, యాదవరెడ్డి, రాజు, శేఖరయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి రథోత్సవం

» కనుల పండువగా నిర్వహణ » భారీగా తరలివచ్చిన భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 9 : ప్రతీ ఏడాది ఎంతో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం చేవెళ్లలోని దేవాయలం నుంచి చేవెళ్ల గ్రామంలోని రచ్చబండ వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం వరకు పూలరథంపై స్వామివారిని ఊరేగించారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో నరేందర్, దేవస్థానం ఫౌండర్‌లు రాఘవేంద్రాచారి, దేవుని వామనాచార్యులు, ధర్మకర్తలు శ్రీకాంతాచారి, శ్రీపాదు, పూజారులు అనంతం, వాసు, కన్న, వైభవ్, ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ మాలతి, మాజీ ఎంపీపీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నందిని అగసార

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

» ఏషియన్ హెప్టాథ్లాన్ విన్నర్ నందిని అగసార
» దేవేంద్ర విద్యాలయంలో క్రీడాదినోత్సవాలు

మహేశ్వరం, ఫిబ్రవరి 9 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, చదువుతో పాటు ఆసక్తి గల క్రీడల్లో రాణించాలని 2022 ఏషియన్ హెప్టాథ్లాన్ విన్నర్ నందిని అగసార అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయంలో జరిగిన వార్షిక క్రీడాదినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటేలా ప్రోత్సహిస్తున్న దేవేంద్ర విద్యాలయం యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటినుంచి కష్టమని భావించకుండా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. దేవేంద్ర విద్యాలయంలో నిర్వహించిన క్రీడాదినోత్సవాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. దేవేంద్ర విద్యాలయం డైరెక్టర్ టి.విజయేందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యమన్నారు. పాఠశాల ఛైర్మన్ దేవేందర్‌గౌడ్ ఆకాంక్ష మేరకు విద్యాలయంలో సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యాబోధన చేసేందుకు యత్నిస్తున్నామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ టి.శ్వేత, వినయేందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ మాధవీశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, కార్యనిర్వాహక అధికారి ఎక్బాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హస్తం వైపు పట్నం అడుగులు.. తప్పనిసరి పరిస్థితులేనా!

» నాడు మేనమామ ఇంద్రారెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరని మహేందర్‌రెడ్డి
» ఆ పార్టీ అధికారంలో ఉన్నా విపక్ష ఎమ్మెల్యేగా కొనసాగింపు » చివరికి కాంగ్రెస్ వైపు అడుగులు



తాండూరు, ఫిబ్రవరి 9: 30ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి 1994లో తాండూరు కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రాజకీయంగా తప్పని సరి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 1992లో మేనమామ మాజీ మంత్రి ఇంద్రారెడ్డి ప్రోత్సాహంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి వచ్చిన మహేందర్‌రెడ్డి 1994లో టీడీపీ తరఫున తాండూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1995లో రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభంతో మేనమమ ఇంద్రారెడ్డి , మహేందర్‌రెడ్డి టీడీపీ లక్ష్మీపార్వతి వర్గంలోకి వెళ్లారు. టీడీపీ(ఎల్‌పీ) నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత మహేందర్‌రెడ్డి టీడీపీ (చంద్రబాబు) వర్గంలో చేరారు. 1999, 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి తాండూరు ఎమ్మెల్యేగా మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2014లో టీఆర్ఎస్(ప్రస్తుతం బీఆర్ఎస్)లో చేరి తాండూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. 2018లో తిరిగి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో ఇద్దరి మధ్య గ్రూపు తగాదాలు పెరిగాయి. 2019, 2022లో మహేందర్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగారు. 2023లో మహేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకుండా మంత్రి పదవి కట్టబెట్టి పార్టీని వీడకుండా చెక్ పెట్టారు. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డి సతీమణి 2006, 2014లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, 2019లో వికారాబాద్ జిల్లా జడ్పీఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో సునీతారెడ్డి, మహేందర్‌రెడ్డి ఇద్దరు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిశారు.

వారితో కలిసొచ్చేదెవరో!

ఇప్పటికే మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన తాండూరు, బషీరాబాద్, ఎంపీపీలు అనితాగౌడ్ , కరుణ, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, సొసైటీ ఛైర్మన్లు సురేందర్‌రెడ్డి, అజయ్ ప్రసాద్ , కౌన్సిలర్లు నీరజబాల్‌రెడ్డి, రత్నమాల, తదితరులు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరేందుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తం రావు సిద్ధమయ్యారు. తాండూరు, యలాల, జడ్పీటీసీలు మంజుల, సంధ్య, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ , పశుసంవర్ధక శాఖ మాజీ ఛైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ స్వరూపా చేరుతారా.. లేదా అన్నది సందేహాలు వ్యక్తం కావడంతో మహేందర్‌రెడ్డి వర్గం ప్రయత్నాలు మొదలు పెట్టింది. స్థానికంగా అనుచరులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంపై ఆయన వర్గంలో కొందరు పెదవి విరుస్తున్నారు. నాడు బీఆర్ఎస్‌లో చేరిన సమయంలో ఇక్కడి నేతలను సంప్రదించకుండా పార్టీ మారినా తర్వాత మహేందర్‌రెడ్డి వెంట నడిచారు.



ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న యూనివర్సిటీ అధికారి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 9: వృత్తిపరమైన నైపుణ్యం గల ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దడమే మల్లారెడ్డి యూనివర్సిటీ లక్ష్యమని యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ వీకేఎస్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ ఎంఆర్‌యూ సెట్‌లో విద్యార్థులకు శుక్రవారం మెరిట్ అండ్ స్కాలర్‌షిప్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ వీకేఎస్ రెడ్డి మాట్లాడారు. నైపుణ్యంగల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో తమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అడ్మిషన్ అండ్ స్కాలర్‌షిప్‌ల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చదువుకోవడానికి ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వీలు కల్పించామన్నారు. మెరిట్ ఉన్నప్పటికీ చాలా మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకుని దయనీయ స్థితిలో ఉన్నారని, వారికిది ఒక మంచి అవకాశమన్నారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చి విశ్వవిద్యాలయంలో విద్యాబుద్ధులు నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ స్కాలర్‌షిప్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సీఆర్‌పీల డైరీ ఆవిష్కరణ



సీఆర్‌పీల డైరీని ఆవిష్కరిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 9: కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డిని సమగ్రశిక్షా ఉద్యోగులు కలిశారు. కొడంగల్‌లో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు ప్రత్యేకాధికారి చేతుల మీదుగా సీఆర్‌పీల డైరీని ఆవిష్కరించారు. సమానపనికి సమాన వేతనాలు, రెగ్యులరైజేషన్ లాంటి సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన ఆయన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి, కొడంగల్ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, జమీరుద్దీన్, తిరుమలేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఫిబ్రవరి 9 : తాండూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి వివిధ కేటగిరీల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ 2 పోస్టులు ఉన్నాయని పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా అండ్ కంప్యూటర్ అప్లికేషన్, బ్యాచిలర్ ఇన్ కంప్యూటర్‌సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలని, రికార్డ్ అసిస్టెంట్ 2, హౌస్‌కీపింగ్ 4 పోస్టులకు డిగ్రీ అర్హత, అసిస్టెంట్ లైబ్రరీ 1 పోస్టుకు డిగ్రీ కానీ డిప్లమా ఇన్ లైబ్రరీ సైన్స్ చదివి ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్ 6, ల్యాబ్ అటెండెంట్ 5, లైబ్రెరి అటెండెంట్ 3 పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆమె తెలిపారు. హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టుకు పదవ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని 1 డ్రైవర్ పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ఐటీఐ ఎలక్ట్రానిక్స్, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన వారికి 1 పోస్ట్ ఉన్నందున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 43 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12 నుంచి 17 వరకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల తాండూర్ నందు సమర్పించాల్సిందిగా తెలిపారు. వివరాల కోసం 9948176126ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

పారదర్శకంగా క్షేత్రస్థాయి పరిశీలన

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 9 : మహాలక్ష్మి పథకం కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తులలో తప్పిదాలను సవరించేందుకు నియమించిన బృందాలన్నీ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, నారాయణపూర్ గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా ఈ నెల 10 వరకు పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులో గ్యాస్‌ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ తదితర వివరాలను సరిగా నమోదు చేయాలని చెప్పారు. ఎంపీడీఓలు, తహశీల్దార్లు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారుల నేతృత్వంలో ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. తప్పులు దొర్లకుండా రికార్డులను ఇంటింటికి వెళ్లి పరిశీలించి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, మున్సిపల్ టీపీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

భూములు తీసుకోవద్దని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

కొడంగల్, ఫిబ్రవరి 9 : అభివృద్ధిలో భాగంగా కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్ కాలేజీలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో తమ భూములు తీసుకోవద్దని పలువురు రైతులు కోరారు. మండలంలోని అప్పాయిపల్లిలో గల సర్వే నెం.19 అసైన్డ్ రైతులు శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. సర్వే నెం.19లో 74 ఎకరాల భూమి ఉందని, 47 కుటుంబాలు ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్నాయని వారు కలెక్టర్‌కు వివరించారు. అభివృద్ధి పనుల కోసం అధికారులు ఆ భూమిలో సర్వే నిర్వహించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్య, రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, పకీరప్ప, మోతిబాయి, నర్సమ్మ, రుక్మిణిబాయి, సచిన్, రాములు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా నో రీటెండర్

● ఏళ్ల తరబడి అద్దె నెలకు రూ.500 మాత్రమే

● పట్టించకోని అధికారులు

శంకర్‌పల్లి ఫిబ్రవరి 9 : మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం రీటెండర్ నిర్వహించి అన్ని వర్గాల వారికి దుకాణ సముదాయాలు కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు నాయకులు వాటిని తుంగలో తొక్కారు. శంకర్‌పల్లి గ్రామ పంచాయితీగా ఉన్నప్పటి నుంచి 25 సంవత్సరాలుగా గతంలో ఉన్న వ్యాపారస్తులే దుకాణ సముదాయాల్లో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీగా ఏర్పడ్డాక కూడా ఆదాయానికి 5 ఏళ్లుగా భారీగా గండి పడుతున్నా ఏ ఒక్క అధికారి, నాయకుడూ స్పందించడం లేదని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 15 ఏళ్లుగా 500రూ.లే అద్దె , కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు, కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి ముగ్గురు కమిషనర్లను దర్యాప్తు కొరకు శంకర్‌పల్లి మున్సిపాలిటీకి పంపించగా వారు వచ్చి దర్యాప్తు చేపట్టారు. వారి నివేదిక మేరకు రీటెండర్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ స్థానిక నాయకులు అధికారులపై వత్తిడి తెచ్చి రీటెండర్ నిర్వహించకుండా చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 238 షటర్‌లకు ఒక్కో షటర్‌కు రూ. 500 నుంచి 1000రూ మాత్రమే మున్సిపాలిటీ వారు వసూలు చేస్తున్నారు. పట్టణంలోని ఆర్టీసీ షటర్‌లకు 25 వేల నుంచి 30 వేల వరకు షాపుల నిర్వాహకులు అద్దె చెల్లిస్తున్నారు. కానీ మున్సిపాలిటీ దుకాణ సముదాయాలకు ఇంత తక్కువ అద్దె చెల్లిస్తున్నా రాజకీయ ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ స్పందించడం లేదు. పలు సర్వసభ్య సమావేశాలలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు సమావేశంలో రీటెండర్‌లు నిర్వహించాలని ప్రశ్నించినా సంబంధిత అధికారలెవరు స్పందించకపోగా, నెలకు రూ.కోటికి పైగా ఆదాయం రావాల్సి ఉండగా సూమారు రూ.15 లక్షలు మాత్రమే వస్తుండడంతో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం రీటెండర్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ, మండల ప్రజలు కోరుతున్నారు.

రీటెండర్ నిర్వహించకుండా నిర్లక్ష్యం



ఏళ్ల తరబడి రీటెండర్‌లు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. సర్వసభ సమావేశంలో విన్నవించినా పట్టించకోవడం లేదు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం అన్ని వర్గాల వారికి కేటాయించేలా అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నా.

- రాములు, 8 వవార్డు కౌన్సిలర్



మున్సిపల్ దుకాణ సముదాయం

ఉన్నతాధికారులు ఆదేశిస్తే రీటెండర్



మున్సిపాలిటీ ఆదాయం కోల్పోవడం వాస్తవమే. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే రీటెండర్ నిర్వహిస్తాం. ఇటీవల ఉన్నతాధికారులు దర్యాప్తుకు వచ్చారు. దుకాణసముదాయాలపై వారికి నివేదిక ఇచ్చాం.

- మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్

చనిపోయిన కూలీల పేరిట ఉపాధి డబ్బులు స్వాహా

● సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

● రూ.10 కోట్లకుపైగా నిధులపై దర్యాప్తు

కొడంగల్, ఫిబ్రవరి 9: ఉపాధి హామీ పనులపై మండలంలో జరుగుతున్న 13వ సామాజిక తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. చనిపోయిన కూలీల పేరిట చిన్ననందిగామలో పలువురు ఉపాధి హామీ డబ్బులు స్వాహా చేశారని అధికారులు గుర్తించారు. సామాజిక తనిఖీ కొనసాగుతుండటంతో పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఈ విషయంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రధానంగా మండలంలోని చిన్ననందిగామ తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో పలు అవినీతి అక్రమాలు వెలుగు చూసినట్లు అధికారులు వెల్లడించారు. కూలీల హాజరు నమోదు చేయకపోవడం, సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంపై ఉపాధిహామీ ఏపీడీ సరళ ఉపాధిహామీ క్షేత్రస్థాయి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 13వ విడత సామాజిక తనిఖీలో కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులపై డీఆర్‌ఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు చదివి వినిపించారు. చిన్ననందిగామలో క్రీడా ప్రాంగణం, ఇతర పనుల్లో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్థులు దత్తు తదితరులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కూలీలకు సకాలంలో డబ్బులు అందించడంలో జరిగిన నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో వారం రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. 13వ విడత సామాజిక తనిఖీ ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు .రూ.10,0385899 ఖర్చు చేశారు. పర్సాపూర్, అప్పాయిపల్లి, హస్నాబాద్, అంగడిరైచూర్, రుద్రారం తదితర గ్రామాల్లో సైతం కూలీలకు సకాలంలో డబ్బులు అందించలేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కూలీలకు పనులు కల్పించే దిశగా కూలీ డబ్బులు అందించేందుకు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీలో అవినీతికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు. ఎంపీడీవో పాండు, ఉపాధిహామీ అధికారులు భార్గవి, ఏపీవో రాములు, డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో ఫిర్యాదులు అందిస్తున్న కూలీలు

సంపన్నుల్లో చేతుల్లో వనరుల బందీ

● టీడీపీ నేత బక్కని నర్సింహులు



షాద్‌నగర్, ఫిబ్రవరి 9 : భూములు, జలవనరులు సంపన్నుల చేతుల్లో బందీ అవుతున్నాయని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మానవమనుగడకు, జీవ రాశులు ఉనికికి భూమి అవసరమని చెప్పారు. భూములన్నీ సంపన్నుల చేతుల్లో ఉంటే మానవమనుగడ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, ట్రస్టులు, ఆశ్రమాల పేరట భూముల కొనుగోలు, ఫాంహౌస్‌ల నిర్మాణం వల్ల లక్షలాది ఎకరాలు కొంతమంది చేతుల్లోకి వెళుతోందన్నారు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో కొంతమంది వ్యక్తులు సమాజాన్ని ప్రభావితం చేసే అవకాశముందన్నారు. గతంలో సీలింగ్ యాక్ట్ కింద సేకరించిన భూములు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాస్తు కాలాన్ని రద్దు చేశారని విమర్శించారు. అడవులు, చెట్లు, జలవనరులు విధ్వంసం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కోసం నిస్వార్థంగా పనిచేశా

● పార్టీని మోసం చేసినట్టు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

● టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 9 : గత శాసనసభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ కోసం నిస్వార్థంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఇతర పార్టీలకు మద్దతుగా పనిచేసినట్లు ఆధారాలు ఉంటే నిరుపించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి గత నెల 23న షోకాజ్ నోటీసు ఇస్తే వారికి సమాధానం కూడా ఇచ్చానని, దానితో పార్టీ పూర్తిగా సంతృప్తి చెందిదని అన్నారు. తాను 1998లో ఇంద్రారెడ్డితో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. 2000, 2006, 2019లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీగా కాంగ్రెస్ పార్టీ బీఫాం మీద పోటీ చేసినట్లు తెలిపారు. 2018 శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం తిరిగి పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం చేశానని, 2023 ఎన్నికల్లో షాబాద్ మండలానికే పరిమితం చేశారని అన్నారు. కొంత కాలంగా సోషల్ మీడియా వేదికగా తనపై కొంత మంది తప్పుడు ప్రచారం చేశారన్నారు. పార్టీని మోసం చేయాలనుకుంటే ఎన్నికలకు 15 రోజుల ముందు మద్దూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సోలిపేట్, హైతాబాద్ మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజమియా, శంకర్‌పల్లి మండలం పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మల్కాపూర్ అడ్వకేట్ యాదిరెడ్డిలను పార్టీలోకి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎందుకు తీసుకువస్తానని ప్రశ్నించారు. తనపై తప్పుడు ప్రచారం చేసే వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తనకు నామినేటెడ్ పదవి రాకుండా అడ్డుకోవడానికే ఇలాంటి చౌకబారు ప్రచారాలకు తెరలేపారని అన్నారు. తాను పని చేయకపోతే షాబాద్ మండలంలో పార్టీకి 1890 ఓట్లు, తన స్వగ్రామంలో పార్టీకి ఏవిధంగా లీడ్ వస్తుందని ప్రశ్నించారు. పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు చేవెళ్ల స్వామి, రాజశేఖర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, మాణిక్యం, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, క్రిష్టారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో డేటాసైన్స్ హ్యాకథాన్



అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన డేటాసైన్స్ హ్యాకథాన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా చెప్పారు. అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం డేటా సైన్స్ ఆధ్వర్యంలో 24 గంటల హ్యాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది విద్యార్థులను విభిన్న విద్యానేపథ్యాల నుంచి నుంచి 78 బృందాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, డైరెక్టర్ అనురాగ్ పల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అనురాగ్' గుర్తింపు రద్దు చేయాలి

● ఏబీవీపీ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని, యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని శుక్రవారం ఉదయం ఆ యూనివర్సిటీ ముందు ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ సీఎస్‌సీ విద్యార్థి జ్ఞానేశ్వర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి డీన్ పీఎస్ రావు, పీటీలు కారణమని, వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో డీన్లు, అధ్యాపకులు విద్యార్థులను అవమానపరుస్తూ ఆత్మహత్యలకు పాల్పడే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. వారి కారణంగానే ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డట్లు బాధితుడు చెప్పినా వాళ్ళపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీన్, పీటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకోని విద్యార్థులను పంపించారు. విద్యార్థులు ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏబీవీపీ నాయకులు మహేష్, కార్తీక్, కళ్యాన్, సచిన్, అనిల్, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటేషన్ల రద్దు నిర్ణయం వెనక్కి

తాండూరు, ఫిబ్రవరి 9 : వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని హోల్డ్‌లో పెట్టారు. జిల్లా అంతర్గత డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని ప్రభుత్వం గురువారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సంబంధిత ఉద్యోగులు వారి ప్రాంతాలకు వెళ్ళి జాయినింగ్ కావాలని ఆదేశాలు జారీచేయడంతో వెంటనే జాయిన్ అయ్యారు. డిప్యూటేషన్లు రద్దు చేస్తే చాలా చోట్ల ఆరోగ్య కేంద్రాలకు తాళాలు వేసుకునే పరిస్థితి వస్తుందని భావించి జిల్లాలో అంతర్గత డిప్యుటేషన్లను ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఎక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారో అక్కడే విధులు నిర్వహించాలని డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి ఓరల్ ఆదేశాలను ఫోన్‌లో సమాచారం అందించారు. అంతర్గత డిప్యూటేషన్ విషయంలో అవసరమైన వారిని మినహాయించాలని స్పష్టత వచ్చింది. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో 5గరు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరు వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్నారు.

సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే డెలివరీ చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 9 : 2022-23 ఖరీఫ్, రబీ కాలం మిగులు సిఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సిఐకి వెంటనే ఈనెల 29 వరకు డెలివరీ చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులతో సిఎంఆర్‌రైస్ డెలివరీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అందజేయాలని అన్నారు. మిల్లర్లు ఎవరైనా రీసైక్లింగ్ పాల్పడినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారులు తమ పరిధిలోని మిల్లర్లను సంప్రదించి వారి సామర్థ్యం ప్రకారం సీఎంఆర్ డెలివరీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మిల్లులలో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ కొండల్ రావు, డిప్యూటీ తహసీల్దారులు, రైస్‌మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలేశ్వర గుప్తా, శ్రీధర్‌రెడ్డి, మిల్లుల యజమానులు, పాల్గొన్నారు.

మార్చి 23, 24న ఎంఆర్‌యూ సెట్

● మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ : వీసీ



వీఎస్‌కే రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి యూనివర్సిటీలో అడ్మిషన్ల కోరుకునే అభ్యర్థులకు మార్చి 23, 24తేదీల్లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు యువతకు విలువ ఆధారిత ఉన్నతవిద్యను అందించేడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మార్చి 22లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఎంఆర్‌యూసెట్‌కు హాజరు కావచ్చని వీసీ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి సూచించారు.

నేటి నుంచి సాయి ధ్యానమందిరం వార్షికోత్సవాలు

పరిగి, ఫిబ్రవరి 9 : పట్టణంలోని శ్రీశ్రీశ్రీ షిరిడి సాయి ధ్యానమందిరం 20వ వార్షికోత్సవాలు శని, ఆదివారం జరుగనున్నాయి. ఉత్సవాల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. నేడు సాయిబాబా వారి ఊరేగింపు, ఓంసాయి శ్రీసాయి జయజయసాయి నామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నధాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వహకులు తెలిపారు. రేపు ఉదయం షిరిడి సాయిబాబావారికి కాకడ హారతి, సుప్రభాతం, ఏడు గంటలకు బాబావారికి అభిషేకం, ఉచిత సామూహికసాయి వ్రతాలు జరుగుతాయి. బాబావారికి చందనోత్సవం, సాయి సేవకులచే సత్సంగ ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు బాబాకు హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, బాబావారికి పుష్పాభిషేకం, రాత్రికి శివపార్వతుల కళ్యాణ ఉత్సవం జరుగుతుంది.



సాయి ధ్యాన మందిరం

వీధులను శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, కార్మికులు

యాచారం, ఫిబ్రవరి 9 : ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాచారం మండల కేంద్రంలో ఎంపీపీ కొప్పు సుకన్యబాషా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. పంచాయతీ కార్మికులు, ఉపాధ్యాయులతో కలిసి చెత్తాచెదారం లేకుండ శుభ్రం చేశారు. పలు చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ కార్మికులు వీధులను శుభ్రం చేసి చెత్తచెదారాన్ని గ్రామానికి దూరంగా పడేశారు.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

షాబాద్, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎనలేని కృషి చేసిందని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావదినోత్సం సందర్భంగా షాబాద్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 53 సవంత్సరాలుగా పీఆర్టీయూ పోరాటం చేస్తున్నదన్నారు. గౌరవఅధ్యక్షుడు యాదయ్య, ప్రధానకార్యదర్శి కృష్ణ, నాయకులు నర్సింహులు, డేవిడ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవిందు, హనుమంతు, ఖాజాపాష, అంజి, ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలపై దృష్టి సారించాలి



డాక్టరేట్‌ను అందిస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : విద్యార్థులు తమ పరిశోధనల్లో భాగంగా అన్ని రంగాలపై దృష్టి సారించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ పురుషోత్తంరెడ్డి, యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్, ప్రత్యేక అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. ఆ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నెల్లుట్ల మనోజ్ ప్రొఫెసర్ నర్సింహ పర్యవేక్షణలో రసాయనశాస్త్రంలో సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూయేషన్ అఫ్ నావల్ ఫైవ్ మెంబర్డ్ హెటెరో సైక్లిక్ కాంపౌండ్స్ అనే అంశంపై పరిశోధన చేయగా డాక్టరేట్ వరించింది. దీంతో పురుషోత్తంరెడ్డి, సాత్వికరెడ్డిలు ఆయనను శుక్రవారం అభినందించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యలేనే కాకుండా అన్ని రకాలుగా సామాజిక బాధ్యతవహించి సమాజంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. తమ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్‌లు దామోదర్, రిజిస్టర్ రవీందర్, కవిత, డీన్ క్రిస్టోఫర్, జగదీష్ అధ్యాపక బృందంతో పాటు పీఆర్వో గాదె రాంబాబు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : కేఎల్లార్


మహేశ్వరం : లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మన్‌సాన్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు, మహిళలు

కందుకూరు, ఫిబ్రవరి 9 : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) తెలిపారు. ఎంపీపీ మంద జ్యోతి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డిలు శుక్రవారం తుక్కుగూడలోని కేఎల్లార్ కార్యాలయంలో ఆయన్ను కలిసి మండల పరిషత్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనలకు నిధులు విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి రావాల్సిన నిధులను తప్పకుండా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కాగా, రెండు సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి చొరవతో మండలానికి మంజూరైన రూ.కోటీ 60లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో గ్రామాల్లో పనులు ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, వి.బాబు, వి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

మహేశ్వరం : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి మహేశ్వం నియోజకవర్గాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో ఏనుగుజంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, మురళీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, రాజు, కృష్ణానాయక్, లాజర్, వెంకట్‌రెడ్డిలతో పాటు మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ యాత్రను జయప్రదం చేద్దాం


నందిగామ : మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు

కొత్తూర్, ఫిబ్రవరి 9: ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ చేపడుతున్న న్యాయ్ యాత్రకు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి చేపడుతున్న సంఘీభావ యాత్రను జయప్రదం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొట్టమొదటిగా మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో 11న సంఘీభావ యాత్ర ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కొత్తూర్ మండలంలోని సిద్ధాపూర్, ఎస్‌బీ పల్లి, కొడిచర్ల, పెంజర్ల, కొత్తూర్ మండల కేంద్రంతో పాటు నందిగామ మండలం చేగూర్, వీర్లపల్లి , అప్పారెడ్డిగూడ, నందిగామ మండల కేంద్రంలో యాత్ర కొనసాగుతుందని ఆయన అన్నారు. యాత్రకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని, షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారం కోసమే న్యాయ్ యాత్ర

నందిగామ : సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ యాత్ర చేపట్టారని, దానికి సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టిన న్యాయ్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నందిగామ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జంగ నర్సింలు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలంలో 13న వంశీచందర్‌రెడ్డి సంఘీభావ యాత్ర ప్రవేశిస్తుందని నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎంపీటీసీలు కృష్ణ, ఎంపీటీసీ కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, కావలి కృష్ణ నాయకులు పురుశోత్తంరెడ్డి, జిత్తెందర్‌రెడ్డి, దేపల్లి శంకరయ్య, బుచ్చయ్య, శ్రీశైలం, సాములయ్య, రాజశేఖర్, రవిందర్, నర్సింలు, జ్ఞానేశ్వర్, రూప్‌సింగ్, శ్రీను నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగింపు

నందిగామ, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామ శివారులోని సర్వేనంబర్ 96, 97, 98, 121, 129లో గల యెన్నం చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని శుక్రవారం అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. రియల్ వ్యాపారులు చెరువును కబ్జా చేసి సుమారు 10 ఎకరాల్లో అక్రమంగా ప్రహరీ నిర్మించడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువును పరిశీలించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టాలని, వాటిని తొలగించాలని సూచించినా స్పందించకపోవడంతో రెవెన్యూ అధికారి రోజా చెరువులోని అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేశాయించారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ అధికారి అయ్యప్ప హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మామిడిపల్లి చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న అధికారులు


బస్సును తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉండాలి

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 9 : స్కూల్ బస్సులు విధిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని మరియారాణి పాఠశాల బస్సులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను క్షేమంగా ఇళ్లకు చేరవేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపవద్దని సూచించారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అలెగ్జాండర్, కమల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐ వెంకటేశ్వర్లు బదిలీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 : ఆమనగల్లు సీఐ జె.వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు సైబరాబాద్ కమిషనరేట్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. స్పెషల్ బ్రాంచ్‌కు వెంకటేశ్వర్లును బదిలీ చేశారు. కాగా, ఆమనగల్లుకు ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

మాడ్గుల, ఫిబ్రవరి 9: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు గొడుగు మల్లయ్య, సుధాకర్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ఆర్కపల్లి, ఆవురుపల్లి, కొల్కులపల్లి, నాగిళ్ల, మాడ్గుల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వాటిని సమకూర్చారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు వాటిని అందజేస్తున్నట్లు సభ్యులు వివరించారు.


పుస్తకాలు అందజేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

15 నుంచి శెట్టిపల్లిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో ఈనెల 15 నుంచి 17 వరకు రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎగిరిశెట్టి సత్యం తెలిపారు. 3వ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శెట్టిపల్లి శ్రీ అలివేలుమంగ సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు సత్యం వివరించారు. బాలుర విభాగంలో మొదటి బహుమతి రూ. 20,116, రెండవ బహుమతి రూ.10,116, మూడవ బహుమతి రూ.5,116, బాలికల విభాగంలో మొదటి బహుమతి రూ. 15,116, రెండవ బహుమతి రూ.10,116, మూడవ బహుమతి రూ.6,116, నాల్గవ బహుమతి రూ. 4,116 , పాఠశాల స్థాయి విభాగంలో మొదటి బహుమతి రూ. 4,116, రెండవ బహుమతి రూ.3,116, మూడవ బహుమతి రూ.2,116, నాల్గవ బహుమతి రూ.1,116 లు అందించడం జరుగుతుందని వివరించారు. ఎంట్రిఫీజు రూ.300 లు చెల్లించి తమ జట్ల పేరు నమోదు చేయించుకోవాలని సత్యం కోరారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్ పోటీలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను రేణుకారాజరాజేశ్వరి పీఠం నిర్వాహకుడు, వేద పండితుడు మెళ్లారి నవీన్‌శర్మ ఆవిష్కరించారు.


కరపత్రం విడుదల చేస్తున్న నవీన్‌శర్మ

నేడు చేవెళ్లలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చేవెళ్ల : నేటి (శనివారం) నుంచి చేవెళ్ల పట్టణ కేంద్రంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొండా వెంకట్‌రంగారెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ముఖ్యతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. క్రీడాకారులు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,38,333 మంది ఓటర్లు

- ఈసీ తుది జాబితాలో 11500 తప్పులు.. సరిదిద్దుతున్న ఆర్డీవో, అధికారులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 9 : షాద్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,38,333 మంది ఓటర్లు ఉన్నారని ఆర్డీవో వెంకటమాధవరావు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించిన ఓటర్ల తుది జాబితాలో నియోజకవర్గంలో సుమారు 11,500 మంది ఓటర్ల వివరాలు తప్పుడుగా నమోదయ్యాయని వాటిని ఫారం 8 ద్వారా సరిదిద్దుతున్నామని తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మండలాల వారీగా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కొత్తూరు మండలంలో 13,2,75 మంది పురుష ఓటర్లు, 13,130 మహిళా ఓటర్లు, నందిగామ మండలంలో 13,409 పురుష ఓటర్లు, 13,460 మహిళా ఓటర్లు, కొందుర్గు మండలంలో 11,474 పురుష ఓటర్లు, 11,695 మహిళా ఓటర్లు, చౌదరిగూడ మండలంలో 12,659 పురుష ఓటర్లు, 12,386 మంది మహిళా ఓటర్లు, కేశంపేట మండలంలో 17,864 పురుష ఓటర్లు, 18019 మహిళా ఓటర్లు, ఫరూఖ్‌నగర్ మండలంలో 50,433 మంది పురుష ఓటర్లు, 50,521 మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఎంపీ ఎన్నికలకు ఫైనల్ ఓటర్ లిస్ట్ సిద్ధం

యాచారం, ఫిబ్రవరి 9 : త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఓటర్ లిస్టలను మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అతికించారు. ఓటర్ లిస్ట్ ఫైనల్ కావడంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు జీపీ కార్యాలయాలకు అతికించారు. దాంతో ఆయా గ్రామాల ఓటర్లు తమ పేరును చూసుకొని ఓటర్ లిస్ట్‌లో తన పేరున్న సంఖ్యను రాసుకోవడం కనిపించింది. ఓటర్ లిస్ట్‌లో పేరు లేనివారు, 18 ఏళ్లు నిండినవారు ఫారం 6 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు కోరారు. యాచారం మండలంలో 59 పోలింగ్ కేంద్రాలకు గాను 24243 మంది పురుషులు, 24253 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ కలిపి 48,497మంది ఓటర్లున్నారు. మంచాలలో 45 పోలింగ్ కేంద్రాలు. 20,337మంది పురుషులు, 19,656 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉండగా 39,994 మంది ఓటర్లున్నారు. ఇబ్రహీంపట్నంలో 76 పోలింగ్ కేంద్రాలుండగా 35,700 మంది పురుషులు, 36,385మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉండగా 72,088 మంది ఓటర్లున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో 139 పోలింగ్ కేంద్రాలుండగా 89,433 మంది పురుషులు, 87,004 మంది స్త్రీలు, 31 మంది ట్రాన్స్‌జెండర్‌లుండగా 17,6468 మంది ఓటర్లున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం


చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 9 : కేంద్రం ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఏఐటీయూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి అన్నారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయలన్నారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి శివయ్య, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె. అంజయ్య మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, నాయకులు రామచందర్, ప్రభాకర్, సునీల్, రాజు, ఐలయ్య, కృష్ణ, శ్రీను, లక్ష్మయ్య, కృష్ణగౌడ్, లింగంగౌడ్, మాధవరెడ్డి, రంజిత్, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం : ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ బుగ్గరాములు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో మండల పంచాయతీ అధికారి లక్పతినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. వారాంతపు, పండగ సెలవులు ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల ప్రమాదబీమా కల్పించాలన్నారు.

ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు, రోడ్ సేఫ్టీ టెక్నికల్ టీం ఇన్‌స్పెక్టర్ స్టాలిన్ జోసెఫ్‌లు అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో రోడ్డు భద్రత, డ్రగ్స్ వినియోగంతో అనర్థాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మాదక ద్రవ్యాల వినియోగమనేది నేరమని, ఒక్కసారి కేసులో ఇరుక్కుంటే జీవితం నాశమేనన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, చదువులపైనే దృష్టి సారించి ఉన్నతిలోకి రావాలంటూ సలహా చేశారు. గురునానక్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ జీఎస్ కోహ్లీ, ఎండీ డా. సైనీ, ఎస్సై మారయ్య తదితరులున్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్తంగా..

- **యాచారం** : మండల కేంద్రంలో నడుస్తున్న 108 అంబులెన్స్‌ను 108 ప్రాజెక్టు మేనేజర్ వసంత పాపయ్య తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో మందులు అందుబాటులో ఉన్నాయా? రోజుకు ఎంత మందిని ఆసుపత్రులకు చేరుస్తున్నారు? సిబ్బంది సమస్యలు ఏమిటి? తదితర వివరాలను అంబులెన్స్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
- **ఇబ్రహీంపట్నం** : బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణా సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ బీజేపీ గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎలిమినేడులో గురువారం రాత్రి పల్లె నిద్ర చేశారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దండె శ్రీశైలం యాదవ్, బి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **ఆమనగల్లు** : పీఏసీఎస్ డైరెక్టర్ తిప్పిరెడ్డి అరుణమ్మ భర్త అంతిరెడ్డిని శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ పరామర్శించారు. అంతిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళపల్లిలోని అంతిరెడ్డి నివాసంలో గంప వెంకటేశ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.
- **షాద్‌నగర్ రూరల్** : రైతులు సకాలంలో తమ పశువులకు టీకాలు ఇప్పించాలని జిల్లా పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ అంజిలప్ప తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో ఏర్పాటే చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.
- **కందుకూరు** : కాంగ్రెస్ పార్టీ బాచుపల్లి గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కృష్ణ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా యాలాల రాఘవేందర్, అనేగౌని హరీష్‌గౌడ్, బూత్ కమిటీ అధ్యక్షులుగా కొంతం యుగేందర్‌రెడ్డి, కత్తుల రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా మద్దుల శ్రీశైలం, నవీన్‌గౌడ్, ప్రధానకార్యదర్శులుగా ఎర్ర రాములు, ఇట్టమోని శంకరయ్య, విజయ్‌కుమార్, రాములు, కోశాధికారిగా పి.సుధాకర్, ప్రచార కార్యదర్శులుగా కె.మల్లేష్, కె.శ్రీశైలం, కె.అంజయ్య, కె.నరేందర్, ఎస్సీసెల్ అధ్యక్షులుగా యాదయ్య, బీసీసెల్ అధ్యక్షులుగా గణేష్‌గౌడ్, ఎస్టీసెల్ అధ్యక్షులుగా పి.కృష్ణ, సలహాదారులుగా కప్పాటి పాండురంగారెడ్డి, సుదర్శనాచారిలను ఎన్నుకున్నారు.
- **తలకొండపల్లి** : వెల్జాలలో ఉర్సు ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా మౌలాలి హజ్రత్ షా ఖలందర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రార్థనలు నిర్వహించి రూ.5 వేలు నిర్వాహకులకు అందజేశారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

ఆమనగల్లు, ఫిబ్రవరి 9: ఆమనగల్లును స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్ అన్నారు. 15వ వార్డు ప్రతిభ నగర్ కాలనీలో శుక్రవారం కౌన్సిలర్ లక్ష్మణ్‌తో కలిసి పర్యటించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలో పనులు చేపట్టి పూర్తిచేస్తామని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లు కౌన్సిలర్ లక్ష్మణ్ తెలిపారు. కాలనీవాసులు, సిబ్బంది ఉన్నారు.


కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ శ్యామ్‌సుందర్



హ్యూమాన్ రైట్స్ కౌన్సిల్ క్యాలెండర్ ఆవిష్కరణ

చేవెళ్ల, ఫిబ్రవరి 9 : పట్టణ కేంద్రంలో శుక్రవారం హ్యూమాన్ రైట్స్ కౌన్సిల్ నూతన క్యాలెండర్‌ను ఆ కమిటీ సభ్యులు చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. చేవెళ్ల ఎస్సై వీరబ్రహ్మం, హ్యూమాన్ రైట్స్ కౌన్సిల్ చేవెళ్ల మండల అధ్యక్షుడు సారా శివకుమార్‌జీ, మండల ఎగ్జిక్యూటివ్ సభ్యులు కటికె రమేశ్, డీవీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కన్నతల్లిని కడతేర్చిన తనయుడు

- తాగిన మైకంలో గొంతునులిమి చంపిన కుమారుడు

ఆదిభట్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : తాగిన మైకంలో ఓ వ్యక్తి కన్నతల్లిని గొంతు నులిమి చంపేసిన అమానుష ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ గ్రామానికి చెందిన కోయడ లలిత, భర్త మైసయ్యలు గతంలో కొంగరకలాన్ గ్రామ పంచాయితీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేసేవారు. లలిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వారికి పెంటయ్య అనే కుమారుడు ఉన్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన పెంటయ్య తల్లితో గొడవ పడ్డాడు. తాగిన మైకంలో తల్లి లలిత(51) గొంతు నులిపి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పెంటయ్య ఏమీ తెలియనట్లు శుక్రవారం ఉదయం పోలీసులకు తన తల్లి చనిపోయిందని ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. మృతురాలి మెడపై గాయాలు ఉండటం గమనించి పెంటయ్యను ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడు పెంటయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'వ్యభిచార శిబిరం'పై పోలీసుల దాడి

మొయినాబాద్, ఫిబ్రవరి 9 : రెండు నెలలుగా ఓ వ్యవసాయ క్షేత్రంలో గుట్టుగా వ్యభిచార శిబిరం నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో మొయినాబాద్, ఎస్వోటీ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడులు చేశారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి పరిధిలోని హాపీహోమ్ వెంచర్‌లో నగరానికి చెందిన రాజు అనే వ్యక్తికి సంబంధించిన వ్యవసాయ క్షేత్రం ఉంది. అయితే, ఏపీలోని రాజమండ్రికి చెందిన శ్రీనివాస్, మొయినాబాద్ మండలానికి చెందిన రాజులు వ్యవసాయ క్షేత్రాన్ని అద్దెకు తీసుకున్నారు. గుట్టుగా వ్యభిచార శిబిరం నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి స్థానిక, వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో వ్యభిచారం నడిపిస్తున్నారు. యువతులకు ఎంతోకొంత నగదు ముట్టచెప్పి యువకుల నుంచి రూ.2 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. ఈ విషయం ఎస్వోటీకి తెలియడంతో గురువారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో మొయినాబాద్ పోలీస్‌లతో కలిసి ఫామ్‌హౌస్‌పై దాడులు చేశారు. దాంతో వ్యభిచార ముఠా గుట్టురట్టయ్యింది. నిర్వాహకులు శ్రీనివాస్, రాజు, వాచ్‌మెన్ సంపత్‌లతో పాటు వ్యభిచారంలో పాల్గొన్న ముగ్గురు యువతులను, నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17,880 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేస్తున్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో లారీ నడిపి..

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌కు పదేళ్ల జైలు

- రెండేళ్ల క్రితం నందిగామలో ఘటన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 : మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఓ వ్యక్తి మృతికి కారకుడైన లారీడ్రైవర్‌కు పదేళ్ల జైలు, రూ.26వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు 9వ అదనపు జిల్లా జడ్జి శుక్రవారం తీర్పునిచ్చారు. 2021 డిసెంబర్ 7న నందిగామ గ్రామంలో అయ్యప్ప ఆలయ సమీపంలో వికారాబాద్‌కు చెందిన డ్రైవర్ మల్‌సెట్టి యశ్వంత్ మద్యం మత్తులో తన లారీని వేగంగా నడుపుకుంటూ రోడ్డుపక్కన ఉన్న ఓ చెట్టును ఢీకొట్టాడు. దాంతె చెట్టు విరిగిపడి శ్రీధర్(61)అనే వ్యక్తిపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత పక్కనే స్కూటీ ఆపి నిలబడి ఉన్న విశ్వనాథ్, సురేశ్‌కుమార్(27) అనే వ్యక్తులపైకి లారీ దూసుకెళ్లింది. సురేశ్‌కుమార్ అక్కడికక్కడే చనిపోగా విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీధర్‌కు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమే కాకుండా... నిర్లక్ష్యంగా, అతివేగంగా లారీ డ్రైవ్ చేశాడని, అతనిపై ఎంవీ యాక్ట్‌తో పాటు ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేయగా.. నేర నిర్ధారణ జరగడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కాలిపోయిన బంచ్ కేబుల్ వైరు
- చిన్నారులు పాఠశాలకు వెళ్తుండగా ఘటన
- ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తాం : ఏఈ


చిన్నతూండ్లలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, తెగిపోయిన బంచ్ కేబుల్ వైర్

యాచారం, ఫిబ్రవరి 9 : మండలంలోని చిన్న తూండ్లలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. రజక బస్తీలో మిట్టుతో పాటు సురేష్ అనే వ్యక్తి వారి పిల్లలను స్కూల్ బస్ ఎక్కించడాని కి ఇంటి నుంచి బయటకు వచ్చారు. అనంతరం బస్‌స్టాండ్‌కు వెళుతున్న క్రమంలో ఇళ్ల మధ్యనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బంచ్ కేబుల్ వైరు కాలి తె గిపోయింది. గమనించిన సురేష్ గట్టిగా అరవడంతో స్కూల్‌కు వెళ్లే పిల్లలంతా ఒక్కసారిగా తమతమ ఇళ్లలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న కా రేబార్ మహేందర్ సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులు గమనించకుండా బస్తీలోకి వె ళ్లి ఉంటే ప్రాణాలు గాలిలో కలిసేవి. ఏఈ సందీప్ సిబ్బందితో బంచ్‌కేబుల్ ను అతికించారు. కాగా, పది రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే చోటుకి మార్చనున్నట్లు ఏఈ చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న సీఐ విష్ణువర్ధన్ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దని ఆయన సూచించారు. మాడ్గుల సీఐగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వాహణలో అధికారులు, సిబ్బంది అలసత్వానికి తావివ్వకుండా పనిచేసే చోట ప్రజల అభిమానం చూరగొనాలన్నారు. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నారాయణ రెడ్డి తెలిపారు. జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 9 : కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి తెలిపారు. గావ్ చల్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డిగూడ బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జైసింహారెడ్డి, అక్షయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీరు వృథా.. ఎయిర్‌వాల్వ్ సరిచేయని అధికారులు



యాచారం, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ సమీపంలో నాలుగైదు రోజులుగా కృష్ణా వాటర్ ఎయిర్‌వాల్వ్ నుంచి నీరు వృథాగా పోతోంది. ఎయిర్‌వాల్వ్‌ను బాగు చేయకపోవడంతో నీరు లీకవుతుండడంతో పాటు కలుషితమవుతోంది. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే ఎయిర్‌వాల్వ్ బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.